# హోమకుండములో మన అజ్ఞానమును ఆహుతి చేసినట్లు భావించాలి!

**వివిధ శాస్త్రచయము వేదవేదాంగముల్**
**జీవి మనసుతెరను చీల్చలేవు**
**జీవుడివ్వలుండు దేవుడవ్వలనుండు**
**కార్యమిలను ఆవలకారణంబు**

ప్రేమస్వరూపులారా!

మనసు సమత్వమునకు మరొక పేరు తృప్తి. సంకల్పముచేతనే సమస్త సృష్టి గోచరమవుతున్నది. సంకల్పమెట్టిదో మానవ జీవితమట్టిది. మానవ జీవితమనగా సంకల్పములయొక్క ఆటయే! సంకల్పము సజీవమైనది. ఇది మహాశక్తివంతమైనది. మానవుని ఒక ఆలోచననుండి మరొక ఆలోచనకు ప్రయాణము చేయించును. ఒక మనిషిని మరొక మనిషిగా తీర్చిదిద్దును. ప్రాచీన మహర్షులు ప్రథమములో సామాన్య జనులుగా వుండినప్పటికి వారి పవిత్రమైన సంకల్పములే వారిని మహర్షులుగా తీర్చిదిద్దగలిగినవి. కిరాతక వృత్తిలో జీవించుచున్న రత్నాకరుని వాల్మీకి మహర్షిగా మార్చగల్గినది సంకల్పమే! ఇట్టి సంకల్పములు శుద్ధ సంకల్పములనియు, మలిన సంకల్పములనియు రెండు విధములుగా ఉంటాయి.

**ప్రజాక్షేమము నిమిత్తము సంకల్పించేవన్నియూ సత్సంకల్పములే!**

పవిత్ర కార్యములయందు, పరోపకారమైన కార్యములందు, పరమాత్మతత్త్వమునందు

sri sathyasai vachanamrutam

దివ్యత్వమునందు భావమును యిమిడ్చి సంకల్పించుకోటమే శుద్ధసంకల్పములు. ప్రజలయొక్క క్షేమ నిమిత్తమై సంకల్పించుకొనే సంకల్పములన్నియు సత్సంకల్పములే! స్వార్థమును ఆశించక, స్వప్రయోజనమును పాటించక, నిరంతరము దేశముయొక్క క్షేమమే తన క్షేమముగా భావించి, విశ్వసించి, తలంచే సంకల్పములన్నియు సాత్త్విక సంకల్పములే! దుష్టభావములచే యితరులయొక్క ఆనందమును చూచి ఓర్వలేని స్థితిలో, ఆనందమునకు విరుద్ధమైనదానిని అనుసరిస్తూ, యితరుల చెడ్డను గురించి, యితరుల కీడును గురించి, యితరులకు అపకారము గురించి చింతించే సంకల్పములన్నియు దుష్టసంకల్పములు.

మానవునియందు రెండు విధములైన తత్త్వములు కలవు. ఒకటి పశుత్వము, రెండవది దైవత్వము. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే అరిషడ్వర్గములకులోనై, తమ మతిని, గతిని, స్థితిని, సంపత్తిని సద్వినియోగము చేసుకొనక దుస్సంస్కారములచేత, ఉద్రేక భ్రష్టులై, పశువుకంటె హీనమైనస్థితిని అనుభవించటమే పశుసంపత్తి. అట్లుకాక తన మనసును, కాయమును, కర్మను, కర్తవ్యాన్ని పవిత్రమార్గములో ప్రవేశపెట్టి సాధనలు సల్పుతూ, ఆదర్శవంతమైన కర్మలు ఆచరిస్తూ దివ్యత్వమార్గములో తన జీవితమును అంకితము గావించటం మానవుని కర్తవ్యము.

ఈనాడు మానవుడు ఏకత్వాన్ని విస్మరించి, దివ్యత్వాన్ని మరచిపోయి, దానవత్వాన్ని, పశుత్వాన్ని అనుభవించటానికి ప్రయత్నిస్తున్నాడు. ఏ దేశమునందైననూ, ఏ కాలమునందైనను యిద్దరు మానవులు ఒకే విధమైన రూపురేఖలచేతగాని, తలంపులచేగాని, విజ్ఞానప్రజ్ఞానములచేగాని ఒక్కటిగా వుండటమనేది సంభవించదు. సృష్టి చిత్రంబులెంత విచిత్రము! ఇంత ప్రపంచమునందు ఏ దేశమునందైనా వెతకండి. ఇద్దరు మానవులు ఒకే రూపాన్ని ధరించి వున్నారా? ఒకే విధమైన పుష్టి, సంతుష్టి కల్గివుంటున్నారా? ఒకే విధమైన విజ్ఞానప్రజ్ఞానములు కల్గివుంటున్నారా? లేదు. అంతోయింతో భేదము వుంటూనే వుంది. భిన్నత్వాన్ని దర్శించిన అనేకులు ఈ జగత్తునందు భిన్నత్వమునే ప్రచారముచేస్తూ వస్తూంటారు. కాదు, కాదు. భిన్నత్వమునందు యేకత్వమును గుర్తించుకొనగలిగే శక్తిసామర్థ్యములు మానవునియందు వుండినను వాటిని



srisathyasaivachanamrutam

వెలికి తీయక, విచారించక, పరిశోధనలు చేయక, పరిశీలించక, మానవుడు కేవలము భిన్నత్వాన్నే అభివృద్ధిపరచుకుంటున్నాడు.

**జనన, మరణములు ప్రతి మానవునకు సహజమే!**

ప్రతి మానవుడు శరీరమనే ఒక రథము, ఆత్మ అనే ఒక సారధిని కల్గివుంటున్నాడని కఠోపనిషత్తు చెప్పింది. ఏ మానవునికైననూ రెండు దేహములుంటున్నవా? ఏ రథమునకైనను యిద్దరు డ్రైవర్లు వుంటారా? వేరు వేరు సమయములందు వేరు వేరు డ్రైవర్లు వుండవచ్చు కానీ ఒకే సమయమునందు ఒకే రథమునకు యిద్దరు డ్రైవర్లు వుండటానికి వీలుకాదు. ఆత్మతత్త్వమట్లుకాదు. ఎన్ని జన్మలెత్తినప్పటికిని ఎన్ని తరములు మారినప్పటికిని, యీ హృదయమనే స్థాయిలో యీ రౌతు ఒక్కడుగానే వుంటున్నాడు. అతనే ఆత్మ. ఒక్క దేహము, ఒక్క హృదయమే. అందరియందు సమత్వమే! జననమరణములు ప్రతి మానవునకుకూడను సహజమే! కోటీశ్వరుడని ఆకాశమునుండి ఊడిపడడు. తల్లిగర్భమునుండే రావాలి. కోటీశ్వరుడును, కూటి పేదయు తల్లిగర్భమునుండియే ఆవిర్భవిస్తున్నారు. ఆకలిదప్పులు అందరికి సమానమే! శ్రీమంతుడు పంచభక్ష్యపరమాన్నములు భుజించవచ్చును. బీదవాడు అంబలిగంజిని త్రాగవచ్చును. ఇరువురికి ఆకలి ఒక్కటే! కనుక ఆకలిదప్పులు, జననమరణములు, హృదయము, దేహము అందరికి సమానమనే యేకత్వాన్ని మనము గుర్తించటం అత్యవసరము.

**కారణములేని కార్యము జగత్తున కానరాదు**

ప్రతి మానవునియందు దుష్టసంకల్పములుగానీ సత్సంకల్పములుగాని రావటానికి కొన్ని కారణములుంటాయి. కారణము లేని కార్యము జరగటానికి వీలులేదు. వీని సంబంధము అవినాభావసంబంధము. ఒకదానిని వదలి ఒకటి వుండలేవు. కారణములేని కార్యము జగత్తున కానరాదు. అయితే ఒక్కటి మాత్రం యెట్టి కారణం లేకుండా ప్రవేశిస్తూ వుంటుందది. అదియే అహంకారము. ఇది ఆకారమునుకూడ మరపింపజేస్తుంది. తోటి మానవులను కేవలం ఒక గడ్డిపోచవలే భావిస్తుంది. తనకంటె అధికుడులేడని విశ్వసిస్తుంది. ఇదియే దానియొక్క మహాత్మ్యము. దీని మత్తులో మునిగిన మానవుడు ఉన్మత్తుడై

sri sathyasai vachanamrutam

నిరంతరము కన్నులు మూసుకొని వుంటాడు. అహంకారికి మంచిచెడ్డలు యేమాత్రం కనిపించవు. ఇట్టి అహంకారముండినంతవరకు దివ్యత్వమనేది వానికి యే మాత్రము అర్థంకాదు. పశువుకంటె, దానవత్వంకంటె హీనుడైపోతాడు. ఈ అహంకారమును నిర్మూలంగావించే నిమిత్తమై యీనాడు అర్పితము గావించవలసినది, దుర్గుణములను. కాని, మానవత్వము యీవిధమైన దివ్యత్వమువైపుగాని పవిత్రతవైపుగాని ప్రయాణం సల్పటంలేదు. ఎన్ని విధములైన ఉపన్యాసములు విన్నప్పటికిని, యెంతకాలము సత్సంగములో ప్రవేశించినప్పటికిని, మానవుని ప్రవర్తన వున్నస్థానమునందే వుంటున్నది. అనేక విషయాలతో, శాస్త్రాలతో లేక గ్రంథాలతో తలలు నింపుకుంటున్నారేగాని ప్రేమతో హృదయాన్ని నింపుకోటానికి ప్రయత్నించటంలేదు. కేవలం బోధలు వింటున్నారేగాని దానిలో ఆనందం అనుభవించటానికి ప్రయత్నించటంలేదు. ప్రతి సంవత్సరము సమావేశములలో పాల్గొంటున్నారు, ఉపన్యాసములు వింటున్నారు. ఎప్పటినుండో ఆశ్రమవాసం చేస్తున్నారు. ఎవరికి వారు తమ మనసులో యెంతవరకు మార్పుకలిగినది అనే విషయాన్ని విచారిస్తే యేమాత్రముకూడను మార్పుకల్గలేదు. కారణమేమిటి? ఒక గుండు తీసుకొని నీటిలో ముంచినప్పుడు అది నీటిలో వుండవచ్చునుగాని నీరు ఒక చుక్క అయినా గుండులో ప్రవేశించదు. అదేవిధంగా మానవులలో శిలవంటి హృదయంగా మారిపోయినది. శిలాహృదయులౌతున్నారేగాని పవిత్రమైన ప్రేమ హృదయులు కావటంలేదు. కనుక, ప్రేమ హృదయులు కావటానికి ప్రయత్నించాలి! ప్రేమచేతనే మానవుడు అనేక విధములైన పవిత్రకార్యము లాచరిస్తాడు. ప్రేమయే లేకుండిన జీవితమేలేదు. ముమ్ముందు దీని పరిణామము యేరీతిగా వుంటుందనే విచారణకూడను చేయటంలేదు. ఇప్పటి జీవితానికి మాత్రమే ఉబ్బి తబ్బిబ్బు అవుతున్నారు. ఎన్ని బలములువుండినప్పటికిని, దైవబలమే లేకుండిన సర్వబలములుకూడను దుర్బలములు.

**భుజబలము మరియు బుద్ధిబలములున్న**
**దైవబలము లేక దీనుడగును**
**కర్ణుడంతటివాడు కడపటికేమయ్యె**
**మరువబోకుడిట్టి మంచిమాట.**



sri sathyasaivachanamrutam

కర్ణుడికి వుండిన బలము, కర్ణునికి వుండిన శక్తి, ధీశక్తి వేరెవరికి లేవు. అనేక రకములైన శక్తులు వుండినప్పటికి, చివరకు దైవబలము లేకపోవటముచేత కర్ణునికేగతి పట్టింది?

**గుణబలముతో జీవించటానికి ప్రయత్నించు!**

పవిత్రమైన భావాలను మన హృదయంలో చేర్చుకోవాలి. దివ్యమైన భావాలు మన హృదయంలో చేర్చుకోవాలి. మహర్షులు అందించిన దివ్యభావాలు మనం స్మరిస్తూరావాలి. యజ్ఞయాగాదిక్రతువులు ఆచరించటము జీవిత నిమిత్తము. జీవితమే ఒక యజ్ఞము. మానవునకు116 సంవత్సరములు ఆయువు. మొదటి 24 సంవత్సరములు బాల్యముతో నిండివుంటుంది. అనగా ప్రాతఃకాలముగా వుంటాది. యింక 40 సంవత్సరములంతా మధ్యాహ్నకాలంగా వుంటుంది. అతి తీక్షణమై యింద్రియ ప్రోద్బలముచేత, విషయవాసనలలో మునిగి, నిజవిజ్ఞానమును మరచి, కన్నులు తెరువక భుజబలమున్నదనే గర్వముతో నలుబది సంవత్సరములు గడుస్తాయి. తరువాత వృద్ధాప్యము ప్రారంభమైనప్పుడు యీవిధమైన వాసనలంతా అణగించుకొని దారాపుత్రాదుల అభివృద్ధి నిమిత్తమై చింతిస్తూ వుంటాడు. దేహములో కండబలము వున్నంతవరకు దేహబలమును చూసి మనము మురిసిపోరాదు. దేహమనేది కేవలము ఐసుగడ్డ వంటిది. క్షణక్షణమునకు దీని ఆయుఃప్రమాణము తరిగిపోతూ వుంటుంది. ధనబలము చూస్తామా అంటే అది మరింత అనిత్యము. ధనబలముండినంతవరకు తను అనేక విధములైన పాట్లు పడవచ్చును. ధనబలము తరిగిపోగానే అతని మొహం చూసేవారు యెవ్వరు వుండరు. అంధకారము క్రమ్ముకుంటుంది. ఇది కేవలము ఒక మెరుపువంటిది. మెరుపు మెరిసిన తక్షణమే గొప్ప ప్రకాశము వస్తుంది. ఆ వెనువెంటనే అంధకారం క్రమ్ముకుంటుంది. ధనమునుగురించి మనం యోచించి దీనితో ఆనందాన్ని పొందుటకు యేమాత్రంకూడను ఆధారంలేదు. కనుకనే గుణబలమును చూచి నీవు జీవించటానికి ప్రయత్నించు.

**హరిశ్చంద్రుని సత్యనిరతి, చంద్రమతియొక్క సహనము మరియు లోహితాస్యుని వినయమును ప్రతి తల్లితండ్రులు పిల్లలకు బోధించాలి**

జీవితమును పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టటానికి పూనుకోవాలి. ఒక సత్యాన్ని

సాధించే నిమిత్తమై హరిశ్చంద్రుడు యెన్నివిధములైన కష్టములకు గురయ్యాడు! పతిని అనుసరించే నిమిత్తమై అతని భార్య చంద్రమతి యెంత సహనమును పొందినది! తండ్రి ఆజ్ఞను శిరసావహించి లోహితాస్యుడు యెంత వినయాన్ని ప్రకటితం గావించాడు! హరిశ్చంద్రునివంటి సత్యమును, చంద్రమతివంటి సహనమును, లోహితాస్యునివంటి వినయమును ప్రతి తల్లితండ్రులు పిల్లలకు బోధించాలి. చిన్నతనమునుండి పిల్లల హృదయాన్ని మృదుమధురంగా మార్చినప్పుడే భవిష్యత్తునందు వారు అనేక విధములైన సుఖసంతోషములను అనుభవించగలరు.

మానవత్వములో లౌకికమైన శక్తియుక్తులకంటె వాటికతీతమైన శక్తి చాలా అవసరము. కనుకనే యీ పదార్థశక్తికంటె పవిత్రమైన దివ్యశక్తి చాలా వుత్తమమైనదని నిరూపిస్తూ వచ్చింది, వేదము. అలాంటి దివ్యమైన శక్తిని కొంతవరకునైనా మనము అనుభవించటానికి, పరులకు అందించటానికి కృషి చేయాలి.

### పవిత్రమైన ఫలమును త్యాగము చేయటమే నిజమైన త్యాగము

దివ్యాత్మస్వరూపులారా! మనలో కొంచమైనాకూడను పరివర్తనరాకుంటే మన జీవితమును, మన కాయమును, మన కర్తవ్యాన్నికూడను మనం దుర్వినియోగము చేసినవారమవుతాము. ఎప్పటినుండియో మీరు ప్రశాంతి నిలయమునకు వస్తున్నారు. నలభై, నలభైఐదు సంవత్సరములనుండికూడను స్వామి బోధనలు వింటూనే వస్తున్నారు. కానీ దినదినమునకు మీ కోరికలు మితిమీరిపోతున్నవి కాని, త్యాగము అనేది మీలో అణుమాత్రంకూడను ప్రారంభం కావటంలేదు. కొంత మాత్రమైనా ఆశలను అదుపులో వుంచుకోరాదా? ఆశ్రమములో మీరు చింతించటము అంతా మీమీ సంసారములను గురించే! ఇది నిజమైన సాధన కానేరదు. ఎంతకాలమైనప్పటికి దేహములను వదలక తప్పదు. అవి మనలను వదలక పూర్వమే మనం వాటిని వదలటానికి ప్రయత్నంచేసినవారే ధీరులు. సర్వమూ మనలను వదలిన తరువాత విచారముతో దేహమును వదలి ప్రయోజనము యేమిటి? త్యాగమనగా యేమిటి? పవిత్రమైన ఫలమును త్యాగము

sri sathyasai vachanamrutam

చేయటమే నిజమైన త్యాగము. కుళ్లిపోయిన ఫలములు యెవరైనా త్యాగమని చెప్పటానికి వీలవుతుందా? కనుక, శరీరములో బలము వుండినప్పుడే, మనోశక్తి వికసించినప్పుడే, భక్తి ప్రకటించినప్పుడే, కాలుని పాశము మన శిరముపైన పడక మునుపే మనము జాగ్రత్త వహించి సత్కార్యములలో పాల్గొనాలి. ఇదే జనసేవ. సమాజసేవ. అట్లుకాకుండా కేవలము అహంకారముతో విఱ్ఱవీగినంత మాత్రమున జీవితము సార్ధకముకాదు.

**అహంకారమువలన మానవుడు అథోగతి పాలవుతాడు**

రావణుడు దేహరీతిగా మహాబలవంతుడు. మహాఐశ్వర్యవంతుడు. విజ్ఞానప్రజ్ఞాములలోగాని, మరి యేవిధమైన గజకర్ణ, గోకర్ణ విద్యలలోగాని రావణుడు మహావిద్యావంతుడు. వీటన్నిటివలన అతనిలో ఆవిర్భవించిన అహము అతనిని కన్నూమిన్నూ కానక ప్రవర్తింపచేసింది. ఇతను ఈశ్వరుని పరమభక్తుడు. ఎంత భక్తి వుండి ప్రయోజనము యేమిటి? ఎంత ధనము వుండి ప్రయోజనము యేమిటి? బలము వుండి ప్రయోజనము యేమిటి? పవిత్రమైన ప్రవర్తన లేవపోవటంచేత ఈశ్వరదత్తమైన లంకనుకూడను భస్మము గావించుకున్నాడు. ఎంతటి వైజ్ఞానికుడైనప్పటికి, చంద్రమండలములో కాలుపెట్టినప్పటికిని, కాలుజారితే ముక్కలు ముక్కలైపోతాడు. అధోగతికి చేరిపోతాడు. అహంకారము మానవులలో ప్రవేశిస్తే యెంతటి వాడైనప్పటికిని వానిని అధోగతి పాలుచేస్తుంది. కాషాయబట్టలు వేసుకున్నంత మాత్రమున సన్యాసికాడు. ఆ విధముగా సన్యాసత్వమును మనం విశ్వసించినట్లైతే రావణుడు మోసపు సన్యాసివేషము వేసుకొని సీతను అపహరించాడు. అర్జునుడుకూడను తనను ఆవరించిన యుద్ధమేఘములనుండి తప్పించుకునే నిమిత్తమై ప్రమీల దగ్గరకు సన్యాసివేషంలో వెళ్ళాడు. కేవలము వేషముతో రాదు, సన్యాసము. బట్టలలోకాదు సన్యాసము, క్రియలలో రావాలి.

**సర్వమును యేకత్వముగా గుర్తించటమే బ్రహ్మప్రాప్తి**

ఇలాంటి విషయములోపల మనము యీనాడు చాలా బలహీనతలకు గురౌతున్నాము. చెప్పునది ఒకటి, చేయునది మరొకటి. ఇది మానవత్వంలో వుండే గొప్ప అవివేకము.

sri sathyasai vachanamrutam

యీనాడు ప్రతీ మానవుడు అంతోయింతో అహంకారము పెంచుకుని దైవత్వాన్ని మరచి జగత్తులో నిమగ్నమైపోతున్నాడు. ముందు యేమి జరుగునో అనే విషయాన్ని యోచించుకోలేకపోతున్నాడు. భూమియందు విత్తనము పెట్టిన తక్షణమే ఫలము నందించదు. చేసిన దోషములు, చెప్పిన అసత్యములు, అన్యాయములు క్రమక్రమేణా పెరిగి పెద్ద వృక్షముగా మారి యెంతకాలమైనా వాటి ఫలితాన్ని అందిస్తూ వస్తుంటాయి. కనుక సద్భావములను పెంచుకొని, సత్ప్రవర్తనలో మునిగి, పరోపకారములో జీవించి సత్యము నభివృద్ధిపరచటానికి కంకణం కట్టుకోవాలి.

ఈనాడు సప్తాహము సమాప్తము. సమాప్తమనగా బ్రహ్మప్రాప్తి అని మనం గుర్తించాలి. బ్రహ్మపాప్తి అనగా సర్వస్వాన్ని యేకత్వముగా గుర్తించటమే! అన్నింటియందు వుండిన సర్వేశ్వరుని తత్త్వాన్ని విశ్వసించటమే ఒక బ్రహ్మత్వము. అయితే యీనాడు మనలోవున్న దుర్గుణములు, దురాలోచనలు, దుశ్చింతలు, దుర్భావములు యీ అగ్ని అనే దైవత్వంలోపల ఆహుతిగావించి, సద్భావములు, సదాచారములు, సద్గుణములు పోషించుకోటానికి తగిన కృషి చెయ్యాలి.

## కీడుచేయటం గొప్పకాదు, మంచిచేయటం గొప్ప

జీవితం యెండ, నీడలతో కూడినది. అనగా సుఖ, దుఃఖములతో కూడినది. దుః ఖములేక సుఖము వుండదు. ఎండ ప్రక్కనే నీడవుంటుంది. నీడలనేకము, ఎండ ఒక్కటే! ఒక చెట్టుపైన సూర్యరశ్మి పడినప్పుడు ఆ చెట్టుక్రింద అనేక నీడలుంటుంటాయి. కాని ఎండ ఒక్కటే! ఉపాధి భ్రాంతిచేత అనేక విధములైన వ్యామోహములకు గురై అందులో కొంత అజ్ఞానం ప్రారంభం కావచ్చు, కానీ ఆత్మప్రకాశం ఒక్కటే! మన విజ్ఞానము పెరిగిపోయినదని విఱ్ఱవీగుతున్నాము. నిజముగా విజ్ఞానమే పెరిగివుంటే అజ్ఞానము వుండటానికి అవకాశమేలేదు. విజ్ఞానముతోపాటు అజ్ఞానము అంతకంటె అధికముగా పెరిగిపోతూవుంది యీనాడు. ఇది సరైన విజ్ఞానంకాదు. టార్చిలైటు వేస్తే చీకటి వుంటుందా? టార్చివేసినా చీకటి వుందంటే ఆ టార్చిలో సెల్సులేవన్నమాట! బల్బులేదన్నమాట. బల్బు, సెల్సు రెండూ వుండివుంటే యీవిధమైన చీకటి రావటానికి అవకాశములేదు. విజ్ఞానము, స్వార్థము,

srisathyasaivacharamrutam

స్వప్రయోజనములతో అభివృద్ధి కానేరదు. ఈ దేశంవారు ఆ దేశాన్ని, ఆ దేశంవారు యీ దేశాన్ని భస్మముచేసే అభివృద్ధివున్న విజ్ఞానము పరిపూర్ణ అజ్ఞానము. కీడు కీటకమైనా చేస్తుంది. మేలు మహేశుడైనా చేయటం కష్టం అవుతుంది. కీడు చేయటంకాదు గొప్పతనము. మంచిచేయటం గొప్పతనము.

**మనసునందున మంచి నడతలయందు మంచి**
**చేతలందున మంచి లేకున్న**
**సాయి యెట్లు మెచ్చి సంతోషము మీకిచ్చు?**

మంచి నడతలులేవు, మంచి పలుకులులేవు, మంచి మనసులులేవు. భగవంతుడు మెచ్చి వరాలివ్వాలంటే యెట్లా వచ్చి వరాలిస్తాడు? ఇది కేవలం అజ్ఞానము. భగవంతునినుంచి మనము వరాలు పొందాలనుకుంటే మంచి మనసును అభివృద్ధిపరచుకోవాలి. మంచి పలుకులు మనం వుచ్చరించాలి. మంచి నడతలో మనము ప్రవేశించాలి. ఈ మూడు చేరినప్పుడే దైవత్వం అనేది అక్కడ వుట్టిపడుతుంది.

**ఈనాడు నాస్తికత్వము ప్రబలిపోవటానికి ఆస్తికులే కారణము**

'మనస్యేకమ్, వచస్యేకమ్, కర్మణ్యేకమ్ మహాత్మనమ్'. అట్టి మహత్తరమైన స్థితిని పొందుతాము. 'మనస్సన్యత్, వచస్సన్యత్, కర్మణ్అన్యత్ దురాత్మనమ్'. ఈనాడు అలాంటి పరిస్థితులందే మానవులు కొన్ని బాధలకు గురౌతున్నారు. మంచివారుకూడను యీ జగత్తులో లేకపోలేదు. మంచివారే యీ జగత్తునందు లేకుండిన యీ జగత్తు యీ విధముగా ప్రకాశించేదికాదు. జగతియందు పుణ్యపురుషులు లేకున్న జగమెట్లు వెలుగు పగలుగాను? 'జంతూనాం నరజన్మ దుర్లభమ్'. మానవజన్మ యెత్తి పశువుకంటె హీనంగా ప్రవర్తిస్తున్నారంటే వీరు మానవులని చెప్పటానికి ఎట్లా వీలవుతుంది? నిరంతరము ధనేషణ, దారేషణ, పుత్రేషణ. భక్తి అనేది యెక్కడా కన్పించటంలేదు. అప్పుడప్పుడు part time devotion. అప్పుడప్పుడు జ్ఞాపకమొస్తుంది, భక్తి. ఊరగాయ నంజుకున్నట్లుగా నంజుకుంటారు. నీతలంపెట్టిదో, అట్టిదే ఫలము.

**ఎంతమాత్రము యెవ్వరు తలచిన**



sri sathyasai vachanamrutam

అంతమాత్రమే నీవు

అని అన్నమాచార్యులు చెప్పారు. ఎవరెవరు యెంతమాత్రం తలుస్తారో అంత మాత్రమే వస్తుంది. నదిలో కావలసినంత జలముంటున్నాది. ఎవరెవరు ఎంత పాత్రను తీసుకొని పోతారో అంత పాత్రకే నీరు తీసుకుని రాగలరు. నదిలో దండిగ జలమున్నదికదాయని చిన్నపాత్రను తీసుకునిపోయి ఎక్కువ జలము కావాలంటే అది సాధ్యమవుతుందా? ఇప్పటి భక్తిప్రపత్తులంతాకూడను అదే స్థితిలో వుంటున్నాయి. ముందు ఒక వేషము, వెనుక మరొక వేషము. ముందొక నడత, వెనుక మరియొక నడత. భగవంతునే మోసముచేసే విధముగా ప్రవర్తిస్తున్నారు. ఇది సరైన భావము కాదు. ఇలాంటి ప్రవర్తనలు చూచియే నాస్తికులు అధికమైపోతున్నారు. నాస్తికత్వానికంతా ఆస్తికులే కారణం. చెప్పినట్లు చేయకపోవటమే దీనికి మూలకారణం. కనుక, మనము యీనాటినుండి అయినా మన దుర్గుణములను, దుర్భావములను హోమములో అర్పితం గావించి సద్భావములు, సదాచారములు, సత్యవాక్కులను అభివృద్ధిపరచుకోటానికి ప్రయత్నించాలి.

**భక్తికి సరైన గుర్తు మన ప్రవర్తనలో మార్పు రావడమే!**

మేము స్వామి ఉపన్యాసములు విన్నాము అనేదికాదు, నాకు కావలిసింది. ఉపన్యాసములు చాలా బాగున్నాయి అనేదికాదు, నేను కోరే జవాబు. మేము మారినామనే జవాబు రావాలి. మార్పురావాలి. అదే భక్తికి సరైన గుర్తు. కుంభవర్షము కురుస్తుందని చెబుతూ, యింతైనా తేమ లేకపోతే కుంభవర్షానికి గుర్తేమిటి? భక్తులమని చెప్పకుంటూ దానికి తగినట్లు కించిత్ అయినా మన ప్రవర్తనలో నిరూపించక వుండిన భక్తికి గుర్తేమిటి? ఇది భక్తికి యేమాత్రంకూడను లక్షణంకాదు. చెప్పిన మాటలను చక్కగా నడుచుకోటానికి ప్రయత్నించాలి.

**మంచిమాట వినరు మనసిచ్చి చెప్పిన**
**చెడ్డమాటలంటె చెవికి చేరు**
**ఇట్టివారు సత్యమెరుగంగ నేర్తురా**
**ఎన్ని విద్యలుండి యేమిఫలము?**

srisathyasai vahini / vachanamrutam

మంచిమాటలు చెప్తే ఒక చెవిలో దూరి మరొక చెవిలోంచి వెళ్లిపోతాయి. చెడ్డమాటలంటే రెండు చెవులూ ఐక్యంగా వచ్చి వింటాయి. ఇంకా యిట్లా పెట్టుకొని వింటారు. ఇదా మానవునియొక్క ప్రవవర్తన? ఇది కాదు. మంచిని వినాలి. దీనికొక చిన్న కథ వుంటున్నాది.

## 'ఓం సాయిరాం' మంత్రము హృదయమునుండి రావాలి

పూర్వము ఓంకారోపాసనచేసేవారలకు రాక్షసులు అనేక విధములైన యిబ్బందులు కలిగిస్తూవచ్చారు. నోటితో ఓంకారము ఉచ్చరించిన తక్షణమే అందులో ఒక దుర్గంధము వచ్చేటట్లుగా యీ రాక్షసులు అనేక విధములైన చెడుపులు చేస్తూవచ్చారు. కనుక, నోటితో ఉచ్చారణ చేయటం మానివేశారు, యీ ఋషులు. చెవులతో యీ పవిత్రమైన శబ్దమును శ్రవణము చేయటానికి ప్రయత్నించారు. వీరి చెవులందుకూడను దుశ్శబ్దములను అభివృద్ధి గావించుతూ వచ్చారు, రాక్షసులు. ఇదికాదని తమ ఉచ్ఛ్వాసనిశ్వాసములలోపల ఓంకారమును సాధన చేస్తూవచ్చారు. అందుకు జవాబుగా దుర్గంధమును అధికము గావించుతూ వచ్చారు, రాక్షసులు. ఇక ఇది ఎంతమాత్రము సరైనదికాదని విశ్వసించారు, మునులు. ఈ యెక్క ప్రణవాన్ని ప్రాణంలో పెట్టుకొని వుచ్చరిస్తూ వచ్చారు. రాక్షసులు దేహములోని అంగములవరకు ప్రవేశించవచ్చునేగాని ప్రాణమువరకు ప్రవేశించే అవకాశములేదు. అప్పుడు వారికి యేవిధమైన బాధలను కల్గించలేకపోయారు, రాక్షసులు. ఈ పద్ధతిని బాగుందని ఋషులు, దేవతలంతా యీ ప్రణవాన్ని ప్రాణముతో సమానంగా పెట్టుకొని సాధనలు సలుపుతూవచ్చారు. అదే ప్రణవోపాసన. ఈ ప్రణవోపాసనయందు ఓంకారమును ప్రాణమునందు పెట్టుకొని పోషించారు. 'అయమాత్మ బ్రహ్మ', యీ ఆత్మనేబ్రహ్మ. కనుక ప్రణవము, ఆత్మ, బ్రహ్మ మూడును ఒక్కటే అనే భావముతో భగవంతుని మనము ప్రాణములో పెట్టుకొని పూజించాలి. ప్రాణములో పెట్టుకొని ప్రేమించాలి, ప్రాణసమానముగా ప్రేమించాలి. ఇది సరైన భక్తి. బయటతట్టుమాత్రం 'సాయిరాం', లోపల 'దొంగరాం'. ఎక్కడవుంది 'సాయిరాం'? ఆ 'సాయిరాం' అనేది హృదయమునుండి ప్రారంభం కావాలి. మిగిలినవన్నియును కేవలము జగత్తును మోసగించే ప్రవర్తనలు. సాయి సంస్థలయందు కానీ మరి యే ప్రాంతమునందుకానీ మరి యే దేశమునందుగాని మన భక్తిప్రవర్తనలయందు మనసు ఒక్కటిగానే వుంటుండాలి.



sri sathyasaivachanamrutam

## సర్వభూతములందు వున్న ఆత్మ ఒక్కటే!

ఈ దేహము ఒక రథము. దీనికి రథికుడు ఒక్కడే. ఈ విశ్వాసమును మీరు యీనాడు అభివృద్ధిగావించుకోవాలి. ఫియట్‌కార్లు వుంటున్నాయి. అంబాసిడరు కార్లు వుంటున్నాయి. డాడ్జికార్లు వుంటున్నాయి. ఫోర్డుకార్లు వుంటున్నాయి. బెంజికార్లు వుంటున్నాయి. కార్లు యెన్నెన్నో రకాలు వుంటున్నాయి. అదే రీతిగా యీ దేహములంతాకూడను ఒక్కొక్క దేహము ఒక్కొక్క కారువంటిది. ఒక్కొక్క రథమువంటిది. కాని, డ్రైవరుమాత్రం ఒక్కొక్కడుగానే నిల్చాలి. అతనే ఆత్మస్వరూపుడు. దేహములను కార్లుగా భావించి భగవంతుడు ఒక్కడు మాత్రమే రథికుడుగా వుంటున్నాడనే విశ్వాసాన్ని యీనాడు మనం పెంచుకోటానికి ప్రయత్నించాలి. భిన్నత్వంలో యేమాత్రముకూడను అభివృద్ధికాదు. 'ఏకోవసి సర్వభూతాంతరాత్మ'. వున్నది ఒక్కడే, సర్వభూతములందు! యీవిధమైన తత్త్వాన్ని గుర్తించి యీనాటినుండైనాకూడను మన ప్రవర్తనయందు, మన భక్తియందు కొంతైనా మార్పు తెచ్చే సాధనలకు పూనుకోండి. స్నేహభావము పెంచుకోండి! ఒకరికి, ఒకరికి మధ్య అభిప్రాయభేదములుండినప్పటికి దానిని సవరించుకోటానికి కృషిచెయ్యాలి. మనలో వుండిన అహంకారాన్ని నిర్మూలనంగావిస్తే అన్నీ adjust అయిపోతాయి. సవరించుకొనిపోవచ్చు.

కనుక, యీదసరా యజ్ఞములో మన అజ్ఞానాన్ని హోమకుండములో ఆహుతి చేసినట్లుగా మనం భావించాలి. దానిని ఆహుతిచేసినట్లుగా విశ్వసించాలి. ప్రేమ హృదయాన్ని పెంచుకోవాలి. పాషాణంవలెవున్న హృదయాన్ని పరిశుద్ధముగా మంచిగా దానికందించాలి. మనము యేదో సమావేశములలో పాల్గొనటానికి వచ్చాము, దసరా మహోత్సవములో పాల్గొన్నాము, ఉపన్యాసములు విన్నాము, ఇంటికి వచ్చాము. అంతమాత్రముతోనే స్వామి ఉపన్యాసములు వ్యర్థం గావింపరాదు. స్వామి చెప్పే ఒకటి, రెండు మాటలైనా ఆచరణలో పెట్టి మీ జీవితాన్ని ధన్యము చేసుకోండి!

**(తేదీ 02-10-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivachanamrutam